క్లుప్తంగా

ప్రజల్లో భయాన్ని పోగొట్టాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజల్లో చిరుత భయాన్ని పోగొట్టాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాత్రి చిరుత సంచరించిన వీరన్నపేట్ ప్రాంతాన్ని పరిశీలించారు. చిరుతను పట్టుకునేందుకు చేపట్టిన చర్యలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిరుతను పట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలు త్వరగా చేపట్టాలన్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మాజీ మంత్రి వెంట ముడా మాజీ చైర్మన్ వెంకన్న, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజు తదితరులు ఉన్నారు.

రుద్రారంలో టీబీ శిబిరం



నవాబుపేట: మండలంలోని రుద్రారంలో మంగళవారం టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 129మందికి టీబీ, హెచ్‌ఐవీ తదితర పరీక్షలు నిర్వహించారు. టీబీ అనుమానితులకు ప్రత్యేక పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పద్మజ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. టీబీరహిత సమాజానికి కేంద్రం చేస్తున్న అనేక రకాల కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రావణ్, డాక్టర్ శ్రీజ, శ్రీశైలం, బాల్‌రాజ్‌జయశ్రీ, సత్యప్రకాశ్, కృష్ణ, స్వాతి, మాధవి, రాములమ్మ, మమత, సరోజ, లక్ష్మమ్మ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఊరకుంట పోచమ్మ ఉత్సవ కమిటీ ఎన్నిక

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని పాతబజార్ పోచమ్మ ఆలయం బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మాడమోని నర్సింహ ఎన్నికయ్యారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా బత్తుల బాలు, ఉపాధ్యక్షులు శ్రీశైలం, రాఘవేందర్, శ్రీను, నరేశ్, రవి, పండ్ల శ్రీను, శివకుమార్, కోశాధికారిగా దయాకర్‌గౌడ్, కార్యదర్శి హరీశ్, సంయుక్త కార్యదర్శులు లక్ష్మయ్య, రాము, రాజు, కిశోర్, శంకర్, శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు కుమారస్వామి, వార్డుకౌన్సిలర్ ఉమాశంకర్‌గౌడ్, పాతబజార్ వాసులు మురళి, నర్సింహ, సత్యం, జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

నవాబుపేట: మండలంలోని గుబ్బడిగుచ్చతండాలో మంగళవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. అంటువ్యాధులతో గ్రామానికి చెందిన కొందరు ఆస్పత్రుల్లో చేరడంతో వైద్యసిబ్బంది ప్రతిఇంట్లో దోమల నివారణ మందును పిచికారీ చేశారు. వీధులను శుభ్రం చేయించి వైద్య శిబిరం నిర్వహించి అసరమైన వారికి మందులు అందించారు. అనుమానితులను మండల కేంద్రంలోని ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బందితోపాటు ఎంపీడీఓ జయరాంనాయక్, శ్రీనివాస్, రాములు, శరభలింగం తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత వెల్లడించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం వార్డులో పర్యటించారు. సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీకి నిధులు తీసుకొచ్చి సమస్యలు పరిష్కరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు లత, రాజు, చైతన్య, ప్రశాంత్‌రెడ్డి, సతీశ్, శశికిరణ్, మహేశ్, మినాజ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సినారెకు ఘననివాళి



జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో తెలుగువిభాగం ఆధ్వర్యంలో మంగళవారం డా. సి.నారాయణరెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు విభాగం అధ్యక్షుడు డా.నర్సింహులు మాట్లాడుతూ..సినారె తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.పుష్పలత, వెంకట్‌రెడ్డి, డా.నియాజుద్దీన్, జ్యోతి నిర్మల పాల్గొన్నారు.

ఎవరికీ.. చెప్పుకోలేని బాధ!

- ఒంటికి, రెంటికి విద్యార్థినుల ఇక్కట్లు
- వందమందికి ఒకే వాష్‌రూం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- నిధుల లేమీతో అర్ధాంతరంగా వదిలేసిన కాంట్రాక్టర్
- బాలికల ఇక్కట్లు పట్టని అధికారులు, ప్రజాప్రతినిధులు
- టంకర జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినుల దయనీయ పరిస్థితి



అర్ధాంతరంగా నిర్మించిన మూత్రశాలలు



మూత్రశాల ఎదుట విద్యార్థినుల క్యూలైన్

హన్వాడ: జనాభాపరంగా మండలంలోనే ఆ గ్రామానిది రెండోస్థానం. కానీ ఆ గ్రామంలోని విద్యాలయం అభివృద్ధికి ఆమడదూరం. నిరుపేద విద్యార్థులు చదువుకునే ఆ విద్యాలయం ప్రగతికి నోచుకోకపోవడంతో నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఒంటికి వెళ్లాలంటే క్యూలైన్‌లో నిలబడి గుక్కపట్టుకోవాల్సిందే.. రెంటికొస్తే ఇంటికి పరుగెత్తాల్సిన ఈ దుస్థితి మరెక్కడో కాదు మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరం.. జిల్లాకేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలోని టంకరలోనిది.

❖ మండలంలోని టంకర జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 6–10వ తరగతి విద్యార్థులు 220మంది ఉన్నారు. 100మంది వరకు బాలికలు ఉండగా.. 120మంది బాలురు విద్యనభ్యసిస్తున్నారు. మూడేళ్ల కిందటే అప్‌గ్రేడ్ అయిన ఈ పాఠశాల వసతుల కల్పనలో మాత్రం లో గ్రేడ్‌లోనే ఉంది. ఈడొచ్చిన బాలికలు చదువుతున్నారనే ధ్యాసే లేకుండా అధికార యంత్రాంగం నిద్రావస్తను వీడటంలేదు. ఒంటిక వచ్చిందంటే గుక్కపట్టుకుని క్యూలో నిల్చోనే దుస్థితి ఉండగా.. రెంటికి వచ్చిందంటే ఇంటికి పరుగెత్తాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. బాలిక పరిస్థితి ఇలా ఉంటే ఇక బాలురు అన్నింటికి ఆరుబయటే అన్న చందంగా ఉంది. ఇంత జరుగుతున్నా అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసంపూర్తి మరుగుదొడ్లు ఇంకెన్నాళ్లు..

జెడ్పీ హైస్కూల్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానిక గత ప్రభుత్వంలో మనఊరు–మనబడి కింద రూ.16లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభిస్తే నేటికీ పూర్తికావడంలేదు. దాదాపు 90శాతం పనులు పూర్తిచేసినా.. మిగతా పనులను నిధుల లేమీతో చేతులెత్తేశాడు. అసంపూర్తిగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఒంటికి వెళ్లాలంటే క్యూకట్టాల్సిందే



మా పాఠశాలలో ఒకే బాత్ రూం ఉండడంతో చాలా ఇ బ్బందులు ఎదుర్కొంటున్నాం. గుక్కపట్టుకుని క్యూలైన్‌లో ఉంటున్నాం. రెంటికి ఇంటికే వెళ్లాలి. ఈ సమస్య కారణంగా మనోవేదనకు గురవుతున్నాం. ఒక్కోసారి మూత్రశాల వద్ద గొడవలు పడాల్సి వస్తుంది. కొత్తగా నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు త్వరగా ప్రారంభిస్తే సమస్య తీరుతుంది.

– భవానీ, 10వ తరగతి, విద్యార్థిని

బిల్లులు రాక.. పనులు ఆపిన

గత ప్రభుత్వ హయాంలో మనఊరు–మనబడి కింద పనులు మంజూరుకాగా.. సొంత నిధులతో పనులు ప్రారంభించా. బిల్లుల కోసం వెంపర్లాడితే కొంత బిల్లు మాత్రమే వచ్చింది. మిగతా బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేకపోతున్నా. అధికారులు మిగతా బిల్లులు మంజూరు చేస్తే అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తి చేస్తా.

– జహంగీర్, కాంట్రాక్టర్

నిధుల మంజూరుకు ప్రతిపాదించాం



పాఠశాలలో సమస్య గురించి స్థానికుల నుంచి సమాచారం వచ్చింది. మనఊరు–మనబడి పథకం ప్రస్తుతం రద్దు కావడంతో నిధులు రాలేదని కాంట్రాక్టర్ పనులు నిలిపాడు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేసేందుకు ప్రతిపాదిస్తాం. ఇందుకు గుత్తేదారును ఒప్పించాను. పనులు పూర్తిచేసేందుకు ఒప్పుకొన్నాడు.

– యశోద, ఎంపీడీఓ, హన్వాడ

ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ అప్పగింత



జడ్చర్ల టౌన్: నారాయణపేట నుంచి హైదరాబాద్ బస్సులో వెళ్తున్న ప్రయాణికుడు ప్రజ్వేల్‌శాస్త్రి ల్యాప్‌టాప్‌ను జడ్చర్ల బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు అప్పగించారు. ప్రజ్వేల్‌శాస్త్రి మంగళవారం పేట నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. ల్యాప్‌టాప్, ఇతర వస్తువులున్న బ్యాగ్‌ను బస్సులో పైన ఉంచాడు. మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వస్తుండగా బ్యాగును గుర్తించిన కండక్టర్ ప్రయాణీకులను అడగగా.. ప్రజ్వేల్‌శాస్త్రి సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ పట్టించుకోలేదు. దీంతో కండక్టర్ జడ్చర్ల బస్టాండ్‌లో స్టేషన్ మేనేజర్ రవీంద్రనాథ్‌కు అప్పగించి వెళ్లిపోయాడు. సదరు ప్రయాణికుడు శంషాబాద్ వెళ్లాక తన బ్యాగ్ గుర్తుకొచ్చి కండక్టర్‌ను అడిగాడు. జడ్చర్ల బస్టాండ్‌లో బ్యాగు ఇచ్చినట్లు తెలియజేయడంతో అక్కడ బస్సు దిగి వేరే బస్సులో జడ్చర్లకు చేరుకుని ల్యాప్‌టాప్ పొందాడు. ఏడీసీ కండక్టర్ యాదగిరి, ట్రాఫిక్‌గార్డ్స్ వెంకటయ్య, శివరాముడు, సెక్యూరిటీ గార్డు నర్సింహులు తదితరులు ఉన్నారు.

జీపీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర, జిల్లా నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

నవాబుపేట: పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకునేందును తమ పోరాటం కొనసాగిస్తామని ఆ సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని కోరారు. ఎన్నికల సమయంలో తమకు హామీ ఇచ్చిన ప్రజాప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని దానికి అన్ని సంఘాలు పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. అనంతరం సంఘం నూతన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రసహకార్యదర్శి శ్రీనివాస్‌చారి, జిల్లా ప్రధానకార్యదర్శి భద్రునాయక్, పాండు, శ్రీనయ్య, నర్సింహులు, రమేశ్, ఆంజనేయులు, కృష్ణ, నర్సింహులు, వెంకటయ్య ఉన్నారు.

విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, జిల్లా అధ్యక్షుడిగా నారాయణనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుస్సేన్, కార్యవవర్గ సభ్యులుగా అనసూయమ్మ, చంద్రకళ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. అంబేద్కర్, పూలే ఆశయ సాధనకు తమ సంఘం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం కంపెనీ అధ్యక్షుడు ఆనంద్ బాబు, జనరల్ సెక్రటరీ బీచుపల్లి, సోమ్లానాయక్, మహేశ్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కుల చిచ్చు పెట్టొద్దు



జడ్చర్ల టౌన్: అందరి సంక్షేమం కోరే తమ పార్టీలో కులచిచ్చు పెట్టరాదని మున్నూరు కాపు సంఘం నాయకులకు బీజేపీ అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్, బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ హితవుపలికారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో పాలమూరుకు చెందిన మున్నూరు రవి విషయంలో సంఘం నాయకులు ఎందుకు స్పందించలేదని, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌ను పార్టీ వీడేలా చేసిన నాయకుల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ప్రస్తుత కేంద్ర మంత్రి బండిసంజయ్‌ని అప్పట్లో హరీశ్‌రావు అరేయ్ అని సంబోధించినప్పుడు ఈ నాయకులు ఎందుకు నోరుమెదపలేదన్నారు. ఆనాడు తాము ప్రశ్నించామని గుర్తుచేశారు. బీజేపీలో ఎవరైనా పార్టీకోసమే పనిచేయాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌గౌడ్, మహేశ్, తిరుపతి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్యాబోధన




మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలు.. అనుకరణతో విద్యాబోధన అందిస్తున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట, పాటలు, కథ, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం, సమయపాలన ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించే విధానంపై టీచర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం డీడబ్ల్యూఓ మాట్లాడుతూ అమ్మబడి తర్వాత మలిబడి అంగన్‌వాడీ కేంద్రాలన్నారు. సమావేశంలో ఈఓ అరుణ, సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్లు ప్రసన్న, నాగేశ్వరి, వసీమ్ సుల్తానా, జంగమ్మ, జయప్రద, అలువేల తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

నవాబుపేట: మండలంలోని కాకర్లపహడ్, కొండాపూర్‌లో ఎంపీ నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో మంగళవారం లైట్లు బిగించారు. అసలే వర్షాకాలంలో వీధులన్నీ అంధకారంలో ఉంటే గ్రామాల ప్రజలకు ఇబ్బందులు వస్తున్నాయని గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఎంపీకి వివరించారు. దీంతో డీకే అరుణ స్పందించి హైమాస్ట్ లైట్లు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీకి బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ,ప్రధాన కార్యదర్శిగణేశ్, నరేందర్, శ్రీనివాస్, యాదయ్య కృతజ్ఞతలు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



సీసీ కుంటలో నాగులకు పాలు పోస్తున్న భక్తులు



మహమ్మదాబాద్‌లో పూజలు చేస్తున్న ప్రజలు



నవాబుపేటలో నాగదేవతల చెంత పూజలు చేస్తున్న భక్తులు

నవాబుపేట: నాగుల పంచమిని మంగళవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షను విరమించి నాగదేవతల విగ్రహాలకు పూజలు చేసి, పుట్టల్లో పాలు పోశారు. శివాలయాలు, నాగదేవతల అవాసాలు మహిళలతో కిక్కిరిసిపోయాయి.

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నాగుల పంచమి సందర్భంగా రామలింగేశ్వర ఆయం వద్ద నాగదేవతల విగ్రహాలకు మహిళలు, చిన్నారులు పాలతో అభిషేకం చేసి, నాగులపుట్టలో పాలు పోశారు.

దేవరకద్ర రూరల్: దేవరకద్ర కన్యకాపరమేశ్వరి ఆలయం, ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయం, లక్ష్మీపల్లి, వెంకటాయపల్లి, చిన్నరాజమూర్, గోపన్‌పల్లి, కౌకుంట్ల, పేరూర్ ఆలయాల్లో భక్తులు నాగదేవత విగ్రహాలు, పుట్టల్లో పాలు పోసి, పేలాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గండేడ్/మహమ్మదాబాద్: మహమ్మదాబాద్, మొకర్లాబాద్, మంగంపేట్, గాధిర్యాల్, నంచర్ల, గండేడ్ మండలంలో వెన్నాచేడ్, కొండారెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, జూనంపల్లి, పెద్దవార్వాల్, సల్కర్‌పేట్, బల్సుర్‌గొండ, పగిడ్యాల్, గండేడ్ తదితర గ్రామాల్లో ప్రజలు సామూహికంగా నాగుల పట్టలకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలంలోని అల్లీపురం, మద్దూర్, చిన్నచింతకుంట, ఏదులాపురం, లాల్‌కోట, దమగ్నాపురం, బండ్రపల్లి తదితర గ్రామాల్లో మహిళలు, నూతన దంపతులు నాగుల విగ్రహాలు, పుట్టల వద్ద పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

చిన్నచింతకుంట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేసి త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశించారు. మంగళవారం కౌకుంట్ల మండలం తిర్మలాపురంలో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఇందిరమ ఇళ్ల నిర్మాణం పనులు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి కొనసాగుతున్న నిర్మాణం పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేసి పూర్తి చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల గదిలో వర్షానికి నీరు కారుతుందని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే రిపేరు చేయించాలని అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికహారం అందించాలన్నారు. కేంద్రంలో గుడ్లు, ఆహార పదార్థాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన రెండు అంగన్‌వాడీలు ఒకే గదిలో ఎందుకు కొనసాగిస్తున్నారని సిబ్బందిని అడగగా ఒక కేంద్రానికి టీచర్ లేరని మరోకేంద్రానికి ఆయా లేరని తెలిపారు. అయితే గ్రామంలో ఒకే కేంద్రాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, రామోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డును పరిశీలించిన అధికారులు



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ సంధ్య

భూత్పూర్: మున్సిపాలిటీలోని గోప్లాపూర్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆ శాఖ దేవరకద్ర డీఈఈ సంధ్య మంగళవారం పరిశీలించారు. ఆరు సంవత్సరాల క్రితం భూత్పూర్ నుంచి కొత్తమొల్గర వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతుండగా.. రైతులు పరిహారం చెల్లించిన తర్వాతనే విస్తరణ పనులు చేపట్టాలని అప్పట్లో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో విస్తరణ పనులు నిలిపివేయాలని కోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో పనులు నిలిపివేశారు. హైకోర్టులో ఇటీవల స్టే తీసివేయడంతో ఆర్‌అండ్‌బీ డీఈఈతోపాటు అధికారులు వచ్చి రోడ్డును పరిశీలించారు. అధికారులు వచ్చిన విషయం తెలుసుకున్న రైతు లక్ష్మారెడ్డి తమ పొలానికి పరిహారం ఇవ్వకుండా రోడ్డు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ఉన్న రోడ్డుపై బీటీ రోడ్డు వేయాలని, విస్తరణ చేపట్టాలంటే తమకు పరిహారం ఇచ్చిన తర్వాతనే విస్తరణ పనులు చేపట్టాలని డీఈఈకి తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీలు లాలూనాయక్, తమ్మన్నగౌడ్, రైతు లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

సామూహిక మంగళగౌరి వ్రతం

జడ్చర్ల టౌన్: శ్రావణమాసం పురస్కరించుకుని మంగళవారం మున్సిపాలిటీ పరిధి లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సామూహిక మంగళగౌరి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. సామూహిక మంగళగౌరి వ్రతం ఆచరించారు. అదేవిధంగా నాగుల పంచమిని పురస్కరించుకొని పుట్టకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. బంగారుమైసమ్మ ఆలయంలో పుట్టకు పాలు పోసేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఎరువుల దుకాణం వద్ద రైతుల క్యూలైన్



హన్వాడ: మండల కేంద్రంలోని ఎరువుల షాపుల వద్ద మంగళవారం రైతుల సందడి కనిపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు ముమ్మరంగా సాగు పనులకు సిద్ధమయ్యారు. ప్రధానంగా డీఏపీ, యూరియా అవసరం కావడంతో రైతులు ఎరువుల దుకాణాలకు పరుగులు పెట్టారు. మంగళవారం ఉదయాన్నే దుకాణాలు తెరవకముందే గుంపులుగా చేరారు. మండల కేంద్రంలోని రెండు ఎరువుల దుకాణాలతోపాటు పీఏసీఎస్ గోదాం వద్ద రైతుల సందడి కనిపించింది. అత్యధికంగా డీఏపీ, యూరియా కొనుగోలు చేశారు. విషయం తెలుసుకున్న ఏడీఏ రామ్‌పాల్, ఏఓ కిరణ్‌కుమార్‌తో కలిసి యూరియా కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు.

ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: టీయూసీఐ ఆధ్వర్యంలో ఈనెల 31న నిర్వహించ తలపెట్టిన ర్యాలీ, ధర్నాను కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. కొత్తచెర్వు రోడ్ ఏరియాలోని రైస్‌మిల్లుల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సతీశ్, రైస్‌మిల్ సంఘం నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

దేవరకద్ర రూరల్: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చొరవతో గద్దెగూడెంలో తాగునీటి సమస్య పరిష్కారమైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామంలో భగీరథ నీరు రాని సమయంలో నీటికోసం ఇబ్బందులు పడ్డామని, ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించి బోరు వేయించి తాగునీటి కష్టాలు తీర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు జాఫర్, రాములు, పూర్ణిత, సతీశ్వర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసునమోదు

రాజాపూర్: మండలంలోని నాన్‌చెరువుతండాకు చెందిన హీరు రెండు రోజుల క్రితం జడ్చర్లకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా సమాచారం లేకపోవడంతో హీరు భార్య చంద్రకళ మంగళవారం రాజాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు.

సంక్షిప్తంగా..

వ్యాధులపైఅప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ.. వరుస వర్షాలతో గ్రామాల్లో నీటి నిల్వలు ఎక్కువై మురుగు వస్తుందని వాటిని వెంటనే తొలగించేలా పంచాయతీ సిబ్బంది పనిచేయాలని సూచించారు. అలాగే ప్రజలందరికీ ఆరోగ్య సూత్రాలు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

కుక్కల దాడి గొర్రెలు మృతి

మిడ్జిల్: మండలంలోని భైరంపల్లికి రైతు పల్లె భీరయ్య గొర్రెల మందపై మంగళవారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయగా. 7గొర్రెలు మృతి చెందిన్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.90వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ విషయం గ్రామపెద్దలు జంగయ్య, రమేశ్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే రూ.20వేల ఆర్థిక సాయం పంపించడంతో కాంగ్రెస్ నాయకులు అందజేశారు. భీరయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో 31న స్పాట్ అడ్మిషన్లు

దేవరకద్ర రూరల్: చౌదర్‌పల్లి సమీపంలోని స్వీట్స్‌లో ఉన్న తెలంగాణ ఎస్సీ గురుకుల కళాశాల(బాలుర)లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియం మొదటి సంవత్సరం ఖాళీ సీట్ల భర్తీకి జూలై 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను అదే రోజు ప్రదర్శించి, అడ్మిషన్ తీసుకుంటామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సుమారు ఆరునెలలపాటు వ్యక్తిగత సెలవుపై వెళ్లిన మున్సిపల్ ఇంజినీరు (ఎంఈ) బస్వరాజ్ తిరిగి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఈయన వచ్చేనెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన సందీప్‌వరల్డ్ డీఈఈగా విధులకు హాజరయ్యారు.

స్టీల్ ప్లేట్ల పంపిణీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీటీగుట్ట పాఠశాలలో నందిని మొబైల్స్ యాజమాని బుచ్చన్న ఆధ్వర్యంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల పంపిణీ చేశారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, ఫిరోజ్‌ఆలీ, గులాంఅహ్మద్, నాగరాజు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దేవరకద్ర రూరల్: బస్వాయపల్లికి చెందిన బాధితుడు కుర్వ ప్రతాప్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన రూ.34వేల చెక్కును ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు పార్టీ నాయకులు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు విక్రమ్, ఫక్రుద్దీన్, శివకుమార్, సురేశ్, శంకర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

రాజాపూర్(బాలానగర్): ఆగిఉన్న లారీని ఢీకొనడంతో భార్యభర్తలకు గాయాలైన ఘటన మంగళవారం బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం ఆత్మకూర్ మండలం మూలమల్లకు చెందిన వినోద్‌రెడ్డి, భార్య నందిని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా పెద్దాయపల్లి ఎక్స్ రోడ్డులో ముందు ఆగిఉన్న లారీని ఢీట్టారు. కారులో ఉన్న నందినికి తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

మహమ్మదాబాద్: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ రాజునాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అన్నారెడ్డిపల్లి హరిజన్‌వాడ పాఠశాలను సందర్శించారు. ఉదయం అసెంబ్లీ సమయానికి చేరుకొని విద్యార్థులతో ప్రార్థన చేయించారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

దేవరకద్ర రూరల్: మండలానికి కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను మంగళవారం లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయం వద్ద పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.